క్లుప్తంగా

రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణం


స్వామివార్ల కల్యాణం జరుపుతున్న అర్చకులు

గూడూరు రూరల్: పట్టణంలోని శ్రీ అంబాభవానీ దేవాలయంలో బుధవారం రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆషాడ మాస శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్ఎస్కే సమాజ్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించారు. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎస్కే సమాజ్ సభ్యులు చంద్రశేఖర్, తాయిరాజు, దమాం వీరేష్, ఈశ్వర్, హనుమంతు, గట్టు నర్సప్ప, బాబు, రాజు, మాధవస్వామి, చిన్న విఠల్, శ్రీలక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలి


మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు షరతులు లేకుండా నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతికి సంబంధించి వెంటనే విధి విధానాలు ప్రకటించాలని కోరారు. ఎలాంటి షరతులు విధించకుండా అందరికీ భృతి అందించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత వయసు 45 ఏళ్ల వరకు ఉండడంతో అంతవరకు భృతి ఇవ్వాలన్నారు. నగర కార్యదర్శి బీసన్న, నాయకులు సురేంద్ర, రాజశేఖర్, కృష్ణ, హుస్సేన్‌బాష, కాశీం, శివ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

కర్నూలు: కర్నూలు నుంచి అలంపూరుకు వెళ్లే మార్గంలో ధర్మపేట వద్ద రైలు ఢీకొట్టిన ప్రమాదంలో తెలంగాణకు చెందిన సునీల్ (35) తీవ్ర గాయాలపాలయ్యాడు. వ్యక్తిగత పని నిమిత్తం కర్నూలుకు వచ్చిన సునీల్ బుధవారం సాయంత్రం మద్యం సేవించి పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. స్థానికులు గుర్తించి చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కర్నూలు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వక భేటీ


నూతన ఎస్పీ జి.బిందుమాధవ్‌నుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జి.బిందుమాధవ్‌ను బుధవారం నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసిన కమిషనర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రిని కలిసిన జేసీ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను జేసీ నారపురెడ్డి మౌర్య మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి పూలబొకేను అందజేశారు. అనంతరం జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

ఏకలవ్యుడి జయంతి

కర్నూలు(అర్బన్): ఆదివాసి, ఎరుకల వీరుడు ఏకలవ్యుడని వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వై.రాజు, బీసీ జనసభ నాయకులు టి.శేషఫణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎరుకల హరి ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ ఎస్.రామస్వామి, జిల్లా గౌరవాధ్యక్షుడు కుమార్, 34వ వార్డు కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, ఉపాధి, సాంకేతిక తదితర రంగాల్లో సమాజం అభివృద్ధి చెందుతున్నా, నేటికి ఎరుకల జాతి అసమానతలకు, అన్యాయాలకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకొని హక్కులు సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు గున్నా మార్క్, ఎరుకల వెంకటస్వామి, మద్దయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సి.బెళగల్: పీర్లదేవుళ్లను ఏటికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం


ముడుమలగుర్తిలో ఏటికి తరలి వెళ్తున్న పీర్లు


గూడూరు: పెంచికలపాడులో పెద్దయ్యపీరును ఊరేగిస్తున్న భక్తులు


కోడుమూరు: ఏటికి వెళ్తుతున్న పీర్లముందు సాహొసేన్ ఆడుతున్న యువకులు, భారీగా తరలివచ్చిన జనం

ఏటికి తరలిన పీర్లు

- వేడుకగా సాగిన పీర్ల ఊరేగింపు
- చివరిగా దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన కోడుమూరు మునిమంద కూడలి
- ముగిసిన మొహర్రం


కోడుమూరులో ఏటికి తరలి వెళ్తుతున్న పీర్ల దేవుళ్లు

కోడుమూరు రూరల్ : భక్తిశ్రద్ధల మధ్య బుధవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. నియోజకవర్గ కేంద్రం కోడుమూరుతోపాటు గ్రామాల్లో పీర్లదేవుళ్లు ఏటికెళ్లారు. కోడుమూరులోని కోటవీధి, మెయిన్ బజార్, చిన్నబోయవీధి, మోబీన్‌వీధుల్లో తదితర తొమ్మిది చావిళ్లలో కొలువుదీరిన పీర్లదేవుళ్లను భక్తులు దర్శించుకుని చెక్కర చదివింపులు చేశారు. మరికొందరు వెండి గొడుగులు, పూల దట్టీలు సమర్పించారు. సాయంత్రం పట్టణంలో కొలువుదీరిన పీర్లదేవుళ్లు స్థానిక మునిమంద కూడలికి చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. పీర్లస్వాములకు బుక్కపిండి సమర్పించి చెక్కర చదివింపులు చేశారు. యువకులు దప్పుచప్పుళ్లకు లయబద్ధంగా ప్రదర్శించిన సాహొసేన్ ఆకట్టుకుంది. విచిత్ర వేషధారణలు అలరించాయి. భక్తజనుల మధ్య పీర్లదేవుళ్లు ఏటికెళ్లారు. ఎస్ఐ బాలనరసింహులు బందోబస్తు పర్యవేక్షించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. ఆయా మసీదుల్లో కొలువైన పీర్లదేవుళ్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పీర్లచావిళ్ల వద్ద ఏర్పాటు చేసిన గుండాలను పూడ్చి మరోమారు పీర్ల దేవుళ్లతో సవారి నిర్వహించారు. అనంతరం పీర్లను గ్రామ చివరకు ఏటికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ పీర్లను తొలగించి మూటకట్టుకుని ముస్లింలు విషాద గీతాలు పాడుకుంటూ ఆయా చావిళ్లకు చేరుకున్నారు. ఎస్ఐ తిమ్మారెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.

గూడూరు రూరల్: మండల కేంద్రం గూడురుతోపాటు గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. ఆయా గ్రామాల్లోని చావిళ్లలో కొలువుదీరిన పీర్ల దేవుళ్లను భక్తులు పుర వీధుల గుండా ఊరేగింపుగా ఏటికి తీసుకెళ్లారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి పీర్లస్వాములను దర్శించుకుని చెక్కర చదివింపులు చేశారు. పీర్ల నిమజ్జనంతో మొహర్రం ముగిసింది. గూడూరు, కె.నాగలాపురం ఎస్ఐలు హనుమంతయ్య, శ్రీనివాసులు బందోబస్తు పర్యవేక్షించారు.


సి.బెళగల్: సుంతానమ్మ దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ముగిసిన మొహర్రం


పాణ్యం : గోరుకల్లులో పెద్దస్వామిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

పాణ్యం: మొహర్రం వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. మండల కేంద్రం పాణ్యం తోపాటు గ్రామాల్లో కొలువుదీరిన పీర్లదేవుళ్లు సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఏటికి తరలించారు. ఆయా గ్రామాల్లో భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వాములు ఏటికి తరలించే ఊరేగింపులో యువత ప్రదర్శించిని సాహొసేన్ ఆకట్టుకుంది. పాణ్యంలోని అలీఅక్బర్‌స్వామి ఊరేగింపు అంగరంగా వైభవంగా సాగింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే సందడిని తిలకించేందుకు ప్రజలు తరలి రావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. గోరుకల్లు గ్రామంలో పెద్దస్వామిని ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. యువకుల నృత్యాలు అలంరించారు. భక్తులు పెద్దస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్ బందోబస్తు పర్యవేక్షించారు.

ఓర్వకల్లు: పీర్లదేవుళ్లు ఏటికి తరలివెళ్లడంతో మొహర్రం వేడుకలు ముగిశాయి. మండల కేంద్రం ఓర్వకల్లుతోపాటు గ్రామాల్లో పీర్ల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య సాగింది. మౌలాలి స్వామి, దస్తగిరిస్వామి, అలీ అక్బర్, పెద్దయ్యస్వామి, చిన్న హసన్, పెద్ద హ సన్ తదితర పీర్ల స్వాములకు భక్తులు చెక్కర, పూల చాందీలు, దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తజన సందోహం మధ్య తరలి పోతున్న పీర్లదేవుళ్లపై స్వీట్లు, పండ్లు విసురుతూ ఘనంగా వీడ్కో లు పలికారు. యువత డప్పులు, మంగళవాయిద్యాల మధ్య చిందులు తొక్కుతూ సంబరాలు జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో బావులు, చెరువుల వద్దకు తీసుకెళ్లి పీర్లదేవుళ్లను నిమజ్జనం చేశారు.

కల్లూరు: మతసామరస్యానికి ప్రతిక అయిన మొహ ర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. పీర్ల దేవుళ్ల ఏటికి తరలింపు సందర్భంగా భక్తులు చెక్కర చదివింపులు చేసి మొక్కులు చెల్లించారు. మరికొందరు పూ లదట్టీలు, వెండి గొడుగులు సమర్పించి మొక్కు లు తీర్చుకున్నారు. పీర్లదేవుళ్లు ఏటికి వెళ్తున్న సందర్భంగా యువకులు ప్రదర్శించిన సాహొసేన్ ఆకట్టుకుంది.

గడివేముల: త్యాగానికి ప్రతీకై నా మొహర్రం వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. మండల కేంద్రం గడివేములతో గ్రామాల్లో కొలువుదీరిన పీర్లదేవుళ్లకు భక్తులు చెక్కర చదివింపులు చేశారు. మరికొందరు పూలదట్టీలు, వెండి గొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పీర్లదేవుళ్లను ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. పీర్ల ఊరేగింపు ముందు యువకుల నృత్యాలు అలరించాయి. విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.


ఓర్వకల్లు: హుసేనాపురంలో నిమజ్జనానికి తరలిపోతున్న పీర్ల స్వాములు


ఓర్వకల్లు : లొద్దిపల్లెలో పీర్లదేవుళ్లను నిమజ్జనానికి తీసుకెళ్లుతున్న దృశ్యం


పాణ్యం: పీర్లస్వాముల ఊరేగింపును తిలకించేందుకు తరలివచ్చిన జనం


కల్లూరు : బస్తిపాడు గ్రామంలో ఏటికి తరలివెళ్తున్న పీర్ల దేవుళ్లు


గడివేముల: ఏటికి తరలివెళ్తున్న పీర్లు


పెసరవాయి గ్రామంలో పీర్లను ఊరేగింపు చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి


అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


తిమ్మగురుడు స్వామి గుడిలో పూజలు చేస్తున్న పాండురంగస్వామి భజన మండలి సభ్యులు

గడివేముల: మండల కేంద్రం గడివేములతోపాటు గ్రామాల్లో బుధవారం ఆషాడ శుద్ధ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకించి దుర్గాభోగేశ్వర స్వామి ఆలయం, బాలాజీ టెంపుల్‌కు భక్తులు పోటెత్తారు. స్వామివార్లకు భక్తులు అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు.

పాణ్యం: తొలిఏకాదశి పూజలు బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున నుంచే వైష్ణవ ఆలయాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లోని ఆలయాలు శ్రీహరి నామమంతో మారుమోగాయి. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పాణ్యంలోని వీరనారాయణస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పాణ్యంలోని ఎస్సార్బీసీ కాలనీలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకాదశి వేడుకులు మిన్నంటాయి. కందికాయపల్లె గ్రామ సమీపాన కొండల్లో వెలిసిన క్రిష్ణకోనలో శ్రీక్రిష్ణుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సి.బెళగల్: తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సి.బెళగల్‌లో వెలసిన రంగనాథుడు ఆలయం, బస్టాండ్‌లోని ఈశ్వరాలయం, కోట వీధులోని రాజరాజేశ్వరి ఆలయం,క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోనవేంకటేశ్వర స్వామి ఆలయం, పోలకల్ గ్రామంలోని చెన్న సోమేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అయ్యప్పస్వామికి ఏకాదశి పూజలు

కోడుమూరు రూరల్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం కోడుమూరులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మపురి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు ఏకాదశి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు 101టెంకాయలు కొట్టి విశేష పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.10కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మపురి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలన్నారు. భవిష్యత్‌లో కోడుమూరులో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయం కర్నూలు జిల్లాకే తలమానికంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జీతూరి రవికుమార్, నాగరాజు, రాఘవేంద్ర, గోపి, యుగంధర్, అశోక్ పాల్గొన్నారు.


దుర్గాభోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు


భజన చేస్తున్న చిన్నారులు

అంబాభవానీ ఆలయంలో భజనలు

గూడూరు రూరల్: గూడూరు పట్టణ ఎస్ఎస్కె సమాజ్ ఆధ్వర్యంలో అంబాభవానీ దేవాలయ భజన మండలి తొలి ఏకాదశిని పురష్కరించుకుని బుధవారం పలు ప్రాంతాల్లో నృత్య రూపంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక తిమ్మగురుడుస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు నైవేద్యాలను అందించారు. అనంతరం తిమ్మగురుడు దేవాలయం, పురాతన అంభాభవానీ, నీలకంఠేశ్వరస్వామి, ఆంజనేయస్వామి గుడిలో కాళ్లకు గజ్జెలు కట్టుకుని కాషాయ జెండాలతో నృత్య భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో దమాం ఈశ్వర్, డీలర్ శివ, రంగస్వామి, శ్రీలక్ష్మీనారాయణ, పరమేష్, చెన్నప్ప, నారాయణ, విఠల్, క్రిష్ణ, విశ్వనాథ్, తాయిరాజు, వీరక్రిష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మేయర్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని దిన్నెదేవరపాడులో నూతనంగా నిర్మించిన ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బిల్డింగ్‌కు తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి బుధవారం భూమిపూజ నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బిల్డింగ్ నగరపాలక సంస్థ పరిధిలో లేకున్నా విద్యుత్ శాఖ విన్నపం మేరకు పాలకవర్గం ఆమోదం వ్యక్తం చేసింది. పైపులైన్ నిర్మాణానికి విద్యుత్ శాఖ రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. పనులు పూర్తయిన తరువాత వినియోగించే నీటికి ప్రతినెలా పన్ను చెల్లిస్తారన్నారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ వైజా అరుణ, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేదల సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి


భూములను పరిశీలిస్తున్న నాగన్న

ఓర్వకల్లు: పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం, వ్యసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని లొద్దిపల్లెలో పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో గత ఇరవై ఏళ్ల నుంచి పేదలు రూ.లక్షల్లో ఖర్చుపెట్టి సాగు చేసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, పాసుబక్‌లు మంజూరు చేస్తామని అధికారులు చెప్పడంతో పేదరైతులు ఎంతో ఆశపడ్డారన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ప్రక్రియ నిలిచిపోయిందని, కూటమి ప్రభుత్వం స్పందించి పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల సహాయ కా ర్యదర్శి మధుసూదన్, మండల నాయకులు రామస్వామి, మాసూంబాషా తదితరులు పాల్గొన్నారు.



ఊరిస్తున్న మేఘాలు!

సి.బెళగల్: అన్నదాత ఆశలు ఆవిరవుతున్నాయి. జూన్ 1న ఖరీఫ్ సీజన్ ప్రారంభమవ్వగా వర్షాలు సైతం విస్తారంగా కురిశాయి. ఎంతో ఆశగా రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేశారు. మండలంలో రైతులు అధికంగా పత్తి సాగు చేశారు. అదే విధంగా కంది, వేరుశనగ సాగు అయ్యింది. జూన్ మొదటి వారంలో కురిసిన వర్షం అనంతరం ముఖం చాటేసింది. సాగు చేసిన పంటలు వాడు పడుతున్నాయి. దీంతో రైతులు ఆకాశంవైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మేఘాలు ఊరిస్తున్నాయి తప్పా వర్షం కురవడం లేదు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి. ఈ రోజు మేఘాలు కమ్ముకున్నాయి.. వర్షం కచ్చితంగా కురుస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న రైతన్నకు చివరకు నిరాశే ఎదురవుతోంది.

కేసీ కెనాల్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేయండి

కర్నూలు (టౌన్): కేసీ కెనాల్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేయాలని, ఎక్కడపడితే అక్కడ ఉన్న చెత్త డంప్‌లను తొలగించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ఆయన బుధవారం నగరంలోని పలు కాలనీలలో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేవీఆర్ కళాశాల వెనుక ఉన్న బాబు జగ్జీవన్‌రావు నగర్‌కు వెళ్లిన మంత్రిని రోడ్లు, డ్రైనేజీలు, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని స్థానికులు విన్నవించారు. ఆనంద్ థియేటర్ వద్ద ఉన్న చెత్త డంప్‌ను తొలగించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, బంగారు పేటలో సామూహిక మరుగుదొడ్ల సమస్య ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ.. వెంటనే మరమ్మత్తులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం పాతబస్తీలోని గడియారం ఆసుపత్రిని మంత్రి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని చెప్పగా.. ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించే ప్రక్రియ జరుగుతుందని కమిషనర్ వెల్లడించారు. నగరపాలక ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, కార్యదర్శి నాగరాజు, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.